క్లుప్తంగా

పంట చేలకు రోడ్డు నిర్మించాలని వినతి


కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన గ్రామస్తులు

కైలాస్‌నగర్: పంట చేలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని ఉట్నూర్ మండలంలోని ఏంకా, నాగాపూర్ గ్రామస్తులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. చేలకు వెళ్లేందుకు రోడ్డు కాలువ నిర్మాణంలో పోయిందన్నారు. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వ్యక్తి తమకు తోవ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ వారికి హామీనిచ్చారు.

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఉద్యోగానికి ఎంపిక

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన దవురే అనిల్ స్టాఫ్ సెలక్షన్ కమి షన్ ఇటీవల విడుదల చేసి న ఫలితాల్లో సత్తాచాటాడు. మల్టీటాస్క్ సర్వీస్ ఉద్యోగం సాధించారు. దవురే అనిల్‌ను ప్రిన్సి పాల్ సునీల్, అధ్యాపకులు అభినందించారు.

సీఆర్టీల నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలి

ఉట్నూర్‌రూరల్: సీఆర్టీల నియామకాల్లో తోటి తెగ అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించాలని ఆదివాసీ విరుదుగోండ్ తోటి సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం శ్రీనివాస్ కోరారు. శనివారం ఐటీడీఏ పీవోను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తోటితెగ అత్యంత వెనుకబడిన ఆదివాసీ తెగలో మొదటి స్థానంలో ఉందన్నారు. ఆర్థిక, సామాజిక, విద్యా, వైద్య, రాజకీయ, ఉద్యోగ అవకాశాల పరంగా తీవ్ర వెనుకబడి ఉన్నామన్నారు.

లంపీస్కిన్ నివారణకు చర్యలు

బజార్‌హత్నూర్: వర్షాకాలంలో ఆవులకు, ఎద్దులకు లంపీస్కిన్ సోకకుండా నివారణకు చర్యలు చేపడుతున్నట్లు పశువైద్యాధికారి ఫర్వేజ్ అహ్మద్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో లంపీస్కిన్ నివారణ టీకాల కార్యక్రమం ప్రాంభించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బజాజ్ రాజభవన్ సందర్శించిన ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: మహారాష్ట్ర పర్యటనలో ఉన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బజాజ్ రాజ భవన్‌ని సందర్శించి అక్కడి అధికారులతో మాట్లాడారు. క్విట్ ఇండియా మూమెంట్, మహాత్మా గాంధీ అనుభవాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం శ్రీ లక్ష్మీనారాయణ ఆలయాన్ని సందర్శించారు.

'వంతెన నిర్మించకపోతే ఆమరణ నిరాహార దీక్ష'

ఆదిలాబాద్: తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మించకపోతే నిరాహార దీక్ష చేస్తానని మలపతి గంగన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వంతెన నిర్మాణాన్ని పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర మంత్రి దృష్టికి సైతం తీసుకువెళ్లి వినతి పత్రం అందించడం జరిగిందన్నారు. సమావేశంలో గ్రామస్తులు రవి కిరణ్, నగేశ్, పోశెట్టి, ఆడేళ్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

బోథ్: హిందూ ధర్మజాగరణ మండలి ఆధ్వర్యంలో సొనాల గ్రామంలోని శ్రీ రామాలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం విజయవంతంగా కొనసాగుతోంది. ప్రతీ శనివారం రాత్రి 7 గంటలకు గ్రామస్తులు, భక్తులు, విద్యార్థులు హనుమంతుని స్మరించుకుంటూ సామూహిక పారాయణంలో పాల్గొంటున్నారు.

జల దోపిడీకి ఏపీ ప్రభుత్వం కుట్ర

ఆదిలాబాద్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణంతో జల దోపిడీకి పాల్పడుతుందని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం జిల్లా సమన్వయకర్త బుట్టి శివకుమార్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. బనకచర్ల ప్రాజెక్టుతో కలుగుతున్న నష్టాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రశాంత్, నాయకులు ప్రేమేందర్, రఘు, కలీమ్, వెంకన్న యాదవ్, మోబిన్, రాజేశ్, అభిలాష్, శివ, కల్యాణ్, సాయికృష్ణ, హరీశ్ పాల్గొన్నారు.

పల్లె దవాఖానా ప్రారంభమెప్పుడు?

- నిర్మాణం పూర్తయిన ప్రారంభానికి నోచుకోని వైనం
- నిరుపయోగంగా భవనం


పల్లె దవాఖానా భవనం

తాంసి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. మండల కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తుంది. తాంసి మండల కేంద్రంలో పల్లె దవాఖాన భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.20 లక్షలను విడుదల చేసింది. నాలుగు నెలల క్రితమే భవన నిర్మాణ పనులు పూర్తయినా.. ఇప్పటికీ ప్రారంభించలేదు. దీంతో లక్షల రూపాయలు పెట్టి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది.

అలంకారప్రాయంగా..

రూ.20 లక్షలతో పల్లె దవాఖాన భవనం నిర్మించినా.. ప్రారంభించక పోవడంతో అలంకారప్రాయంగా మారింది. ప్రస్తుతం జిల్లా పరిషత్ పాఠశాలలోని ఇరుగు గదిలో, అరకొర వసతుల మధ్య పల్లె దవాఖాన కొనసాగుతోంది. దీంతో ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పల్లె దవాఖానా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త భవనాన్ని ప్రారంభించాలి



రూ.లక్షల వ్యయంతో నిర్మించిన భవనం ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారుతుంది. ప్రారంభిస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. అధికారులు వెంటనే సారించి పల్లెదవాఖాన భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలి.
– ఆర్. రాములు, తాంసి

త్వరలో ప్రారంభించేలా చర్యలు

పల్లె దవాఖాన భవనం ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. గతంలో ప్రారంభానికి ఏర్పాట్లు చేయగా మంత్రి పర్యటన రద్దు కావడంతో వాయిదా పడింది. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మళ్లీ త్వరలోనే భవనాన్ని ప్రారంభించేలా చూస్తాం.
– మహేందర్ పంచాయతీరాజ్ ఏఈ, తాంసి

మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

భీంపూర్: మండలంలోని ధనోర నుంచి కరంజి గ్రామానికి కొనసాగుతున్న తాత్కాలిక రోడ్డు పనులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం పరిశీలించారు. గ్రామాల మధ్య డబుల్ రోడ్డు మంజూరు అయినప్పటికీ వర్షాకాలం పనులు ఆలస్యమైందన్నారు. తాత్కాలిక రోడ్డు కోసం రూ. 20 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలున్నారు.

పరామర్శ

భీంపూర్ మండలంలోని గోమిత్రి గ్రామంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ నాగయ్య యాదవ్ చిన్న కుమార్తె హర్షిత ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారి కుటుంబసభ్యులను శనివారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాంసి: మండలంలోని జామిడి గ్రామ మాజీ ఎంపీటీసీ కుటుంబాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం పరామర్శించారు. వారం రోజుల క్రితం మాజీ ఎంపీటీసీ అశోక్ తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. కాగా ఎంపీటీసీ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు.

వంతెన నిర్మించాలని వినతి

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన ఇందారపు రాజు అనే యువకుడు శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలను విన్నవించారు. పెద్దవాగు అవతల భాగంలో సుమారు 500 ఎకరాలకు పైగా నల్లరేగడి భూములు వ్యవసాయానికి అనుకూలంగా ఉన్నప్పటికీ, వంతెన లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

స్టేజీ నిర్మించాలని..

నేరడిగొండ: పాఠశాలలో స్టేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బుగ్గారాం(బి) గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శనివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

బంద్‌కు ఆదివాసీ నాయకుల పిలుపు


మాట్లాడుతున్న ఆదివాసీ సంఘం నాయకులు

బోథ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమురం భీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకువచ్చిన జీవో 49ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న సొనాల మండల బంద్‌కు ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ, పార్డి(బి) రాయిసెంటర్ ఆధ్వర్యంలో శనివారం పిలుపునిచ్చారు. నాయకులు సార్‌మేడి తొడసం లక్ష్మణ్, మెస్రం భూమన్న, రాయి సిడం ఇశ్రు, మారుతి పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఈనెల 21 ఆదివాసీ సంఘాలు తలపెట్టిన బంద్‌లో అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసీ బిర్డ్‌గోండ్ తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు నైతం శేఖర్ కోరారు. శనివారం మండలంలోని దూబార్‌పేట్‌లో ఆదివాసీ నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 49ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సలహాదారుడు కాత్లే విఠల్, చహకటి పవన్, సెడ్మకి సురేందర్, మాడావి గంగాధర్, వెడ్మ గంగాదేవి పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కొట్నాక రఘునాథ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి సిడాం నందకుమార్ మాట్లాడుతూ.. అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలకు అన్యాయం చేయడం సరికాదన్నారు.

నార్నూర్: బంద్‌కు ప్రజాస్వామికవాదులు, చిరు వ్యాపారులు, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల యజమాన్యులు సహకరించాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఆడ శ్రీరామ్ కోరారు. శనివారం నార్నూర్ మండల కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో ఆదివాసీ సంఘాలతో సమావేశం నిర్వహించారు.

- గాదిగూడ మండల కేంద్రంలో నిర్వహించే బంద్‌కు సహకరించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందుర్ సంతోష్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు మాధవి చంద్ర హరిలు పిలుపునిచ్చారు. శనివారం వారు మాట్లాడుతూ.. ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సింది పోయి కొత్త చట్టాలను తీసుకురావడం ఏంటని ప్రశ్నించారు.

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామంలోని ఆదివాసీ సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 49ని రద్దు చేయాలన్నారు. అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. నాయకులు మెస్రం నాగ్‌నాథ్, మెస్రం సుదర్శన్, ఆర్క జంగు, సీతారం పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: బంద్‌కు తొమ్మిది తెగల ఆదివాసీలతో పాటు అందరూ సహకరించి విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా నాయకులు ఉయికే సుదర్శన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జల్కే పాండురంగ్, గంగాధర్, సందీప్, నైతం రమేశ్ పాల్గొన్నారు.

అండర్-13 సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు


ఎంపికైన క్రీడాకారులు

బజార్‌హత్నూర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల క్రీడా మైదానంలో మినీ సబ్ జూనియర్ అండర్-13 బాల, బాలికల సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. సాఫ్ట్‌బాల్ క్రీడల జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ పర్యవేక్షించారు. 150 మంది క్రీడాకారులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 26 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో కిషన్‌గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు గొడం జ్యోతిరాం, పీడీలు అఖిల్, షబర్, జబ్బర్, శైలజ, అక్షయ, మదన్, గౌతమ్, యశ్వంత్ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బడీడు పిల్లలను పనిలో పెట్టుకున్న ఇద్దరు షాపు యజమానులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లోని బేకరీలో, ఖానాపూర్‌లోని ఏఆర్ బేకరీలో 13 ఏళ్ల పిల్లలు పనిచేస్తుండటంతో ముస్కాన్ టీం సభ్యులు గుర్తించారని తెలిపారు. డీసీపీవో రాజేంద్రప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

సన్మానం

నేరడిగొండ: మండల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన శేఖర్‌ను జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. మండల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు.

వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: నిరుపేదలకు అయ్యే వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 మందికి సుమారుగా రూ. 12 లక్షల విలువైన చెక్కులు అందించడం జరిగిందన్నారు. అరుదైన శస్త్ర చికిత్సలు పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రమే జరుగుతున్నాయన్నారు. అటువంటప్పుడు నిరుపేదలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ కింద పూర్తిస్థాయిలో వారికి చికిత్సలు జరగడం లేదన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రజలు వెళ్లినప్పుడు పూర్తిస్థాయిలో చికిత్సకయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల ప్రవీణ్, మయూర్ చంద్ర, కృష్ణ యాదవ్, శ్రీనివాస్, జోగు రవి, దయాకర్, అశోక్ రెడ్డి, రాకేశ్, మహేందర్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్ర సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఇటీవల పాఠశాల స్థాయి క్యాబినెట్ ఎన్నికలను నిర్వహించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్ ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. కార్యక్రమంలో ఏజీఎం అరవింద్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, డీన్ నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు విక్రయ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: కల్తీకల్లు మహమ్మారి నుంచి ప్రజలను కాపాడాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి కోరారు. జిల్లాలో కల్తీ కల్లు విక్రయిస్తున్న కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. కల్తీకల్లు తాగి ఎంతో మంది అనారోగ్య బారినపడుతున్నారన్నారు. ఇందుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. సురేందర్ రెడ్డి, ప్రసాద్ చారి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సలహాలు, సూచనలు చేస్తున్న నరేందర్ రాథోడ్

ఇంద్రవెల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో కొనసాగుతున్న ర్యాపిడ్ ఫీవర్ సర్వే, టీబీ నివారణ చర్యలు, ఓపీ, ప్రసూతి వివరాల రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు పూజిత, మడావి రజనికాంత్, హన్సరి, పద్మ, తిరుమల పాల్గొన్నారు.

నార్నూర్: వర్షాకాలం సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాథోడ్ నరేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఓపి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్, స్టాఫ్ నర్స్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 21 మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరించారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌పీ రాజుబాయి, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, ల్యాబ్ టెక్నీషియన్ పరమేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ


తాంసి: బోనాలతో విద్యార్థులు


బోథ్: వేదం పాఠశాలలో..

నార్నూర్/బోథ్/ఉట్నూర్ రూరల్/ఇచ్చోడ/ నేరడిగొండ: నార్నూర్ మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో, బోథ్ మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో, సొనాల మండలంలోని వివేకానంద పాఠశాలలో, ఉట్నూర్ ఎంపీయూపీఎస్ పాఠశాలలో, ఇచ్చోడ మండలంలోని మేడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో, తాంసి మండల కేంద్రంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో, నేరడిగొండ మండలంలోని కుమారి ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసేందుకే బోనాలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు అమ్మవారి వేషధారణలో దర్శనమిచ్చారు. పోతరాజుల వేషాల్లో పిల్లలు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది.

దనోరా(బి)ని సందర్శించిన ట్రైయినీ కలెక్టర్


నర్సరీని పరిశీలిస్తున్న ట్రైయినీ కలెక్టర్

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా(బి) గ్రామానికి శనివారం జిల్లా ట్రైయినీ కలెక్టర్ సలోని చ్చాబ్ర సందర్శించారు. మండల అధికారులతో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ వ్యవస్థ, పరిపాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి సందర్శించి చిన్నారులకు, బాలింత, గర్భిణులు అందుతున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ కుటుంబరావ్, ఏపీడీ క్రిష్ణరావ్, ఎంపీడీవో భాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ యేర్మ జాకేశ్వర్, సంతోష్ జైస్వాల్, గణేష్, ధమ్మనంద్ పాల్గొన్నారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

బోథ్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ఇంటర్మీడియట్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రత్యేకాధికారి వలిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 22న ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ఎస్సైకి సన్మానం

బోథ్: మండల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీసాయిని బోథ్ మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి, శాలువా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ రెడ్డి, సురేందర్, అల్లకొండ ప్రశాంత్, రమణ గౌడ్, సత్యనారాయణ, ఎలుక రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేర్పించాలి

ఇచ్చోడ: విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేర్పించాలని ఇచ్చోడ వీడీసీ అధ్యక్షుడు పెరమండ్ల నారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలను సందర్శించి మాట్లాడారు. ప్రైవేట్ కన్న దీటుగా విద్య బోధనను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రేణికుంట సురేశ్, అబ్దుల్ గఫార్, పానకంటి ఆశన్న, పిల్లి నరేశ్, పెరమండ్ల స్వామి, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కళ్లద్దాలు పంపిణీ

బోథ్: బోథ్ మండల కేంద్రానికి చెందిన మానం లక్ష్మీవెల్ఫేర్ సొసైటీ ప్రజల శ్రేయస్సు కోసం ఎంతో సేవాభావంతో పని చేస్తోందని బోథ్ ఎస్సై శ్రీ సాయి అన్నారు. శనివారం మండల కేంద్రలోని సాయి నగర్‌లోని బుడగ కమ్యూనిటీ కాలనీలో ఉచిత కళ్లద్దాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకులు ఇర్నల రమేశ్, మెరుగు బోజన్న, కొట్టాల రమేశ్‌రెడ్డి, సంతోష్, ఉమేష్, విఠల్ పాల్గొన్నారు.

హియరింగ్ ఎయిడ్ కిట్ అందజేత

బోథ్: మండలం కనుగుట్ట గ్రామానికి చెందిన నవ్వ రిషికకు హియరింగ్ ఎయిడ్ కిట్ అందజేసి ఆదిలాబాద్ జిల్లా యువ కాంగ్రెస్ నాయకుడు ఏలేటి అశ్విన్ రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. గత కొన్ని రోజుల క్రితం రిషికకు హియరింగ్ ఎయిడ్ కిట్ అవసరం ఉందని తెలుసుకున్న అశ్విన్ రెడ్డి, తక్షణమే బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని స్పందించారు. గతంల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి రూ. 3,45,000 విలువైన హియరింగ్ ఎయిడ్ కిట్‌ను శనివారం రిషికకు అందజేశారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

తాంసి: విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని తాంసి కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరోగ్య కళాశాల కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోశ్, అధ్యాపకులు శశి కుమార్, దేవేందర్, శ్రీనివాస్, అశోక్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

భీంపూర్: మండలంలోని పాలోది నుంచి గుబిడి పల్లె వరకు రూ.10 లక్షల నిధులతో మొరం రోడ్డుకు నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను గ్రామస్తులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి

సాత్నాల: విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించాలని సంకల్పంతో ఆరోగ్య పంచాయతీ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ అన్నారు. శనివారం భోరజ్ మండలం పిప్పర్‌వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య పంచాయతీ, నో బ్యాగ్ డే నిర్వహించారు. మాజీ సర్పంచ్ సంతోష్ రెడ్డి, రాజారెడ్డి, ప్రతాప్ రెడ్డి, వినీత్ రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం భోరజ్ మండలంలోని పలువురు పెండల్‌వాడ గ్రామస్తులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంతోష్ రావు, విట్టల్, సతీష్, నర్సింగ్, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

- ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ నాయకుల, కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు.

పాఠశాలలో నో బ్యాగ్ డే

తలమడుగు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మాక్ గ్రామసభ నిర్వహించి, వివిధ అంశాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకట్ రావ్, ఉపాధ్యాయులు రాజేందర్, శ్రీనివాస్, వినోద్ రెడ్డి, చంద్రమ్మ, వెంకటేశ్వర్, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ ద్వారానే కొనుగోలు చేయాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

బోథ్: కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పత్తి మద్దతు ధర కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు బదులుగా ప్రైవేట్ వ్యాపారులను ప్రవేశపెట్టే యోచనపై రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్‌లో జిల్లా అఖిల పక్ష రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఉండగా.. బోథ్ నుంచి స్వయం కృషి రైతు సంఘం నాయకులు తరలివెళ్లారు. సంఘానికి చెందిన ఇట్టెడి మోహన్ రెడ్డి, సోమ శంకర్, సింగం రమణ, రాజారాం పాల్గొని పలు కీలక అంశాలపై సందేహాలు లేవనెత్తారు. ప్రైవేట్ వ్యాపారుల ద్వారా పత్తి కొనుగోళ్లు జరిపితే రైతులకు నష్టమయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు.